పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు


ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం మండలంలోని సోమరాజుపేట గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క ప్రభుత్వ పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే సమస్య పరిష్కారమవుతోందన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, సర్పంచ్ సవలాపురపు ముద్దులమ్మ, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, పార్టీ నాయకులు సవలాపురపు రమేష్‌నాయుడు, సుంకరి రామస్వామి, ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులే గెలుపు వారధులు


మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

మెంటాడ: గృహసారథులే వైఎస్సార్ సీపీ గెలుపు వారధులని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని చల్లపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పారదర్శకంగా లబ్ధిదారునికి చేరాలన్న సదుద్దేశ్యంతోనే వలంటీర్లను నియమించడం జరిగిందని, ప్రభుత్వం చేసే ప్రతీ మంచి పని ప్రజలకు తెలియజేయాలన్న లక్ష్యంతోనే గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం వల్ల ప్రజలకు చేకూరిన మేలును ఇంటింటికీ వెళ్లి, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వివరించాలని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం గృహసారథులు ఎలా పనిచేయాలన్న దానిని స్క్రీన్‌పై ఓ వీడియో ప్లే చేసి, వివరించారు. అన్ని మండలాల్లో కన్నా మెంటాడలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. ఒక్క మెంటాడలోనే వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో వారం రోజుల్లోనే నగదు జమ చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైనికులైన గృహసారథులు ప్రతీ ఇంటికి ఆయన చేసిన మంచిని వివరించి, పార్టీ గెలించేందుకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.సన్యాసినాయుడు, జెడ్పీటీసీ ఎల్.సన్యాసప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఎస్.ఈశ్వరరావు గృహసారథుల మండల కన్వీనర్ కె.త్రినాథరావు, సర్పంచ్ టి.తనూజ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి


కార్యక్రమానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు

- గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

తెర్లాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో జరిగిన గృహసారథుల శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులదేనన్నారు. ప్రభుత్వం చేసే ప్రతీ మంచి పనిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. 2024 ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్త దగ్గర నుంచి నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులంతా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండలంలో కూడా పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పారదర్శక పాలన, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తున్న తీరు ప్రజలకు నచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్, వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎంపీపీ ఎస్.ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు లూర్దు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి, తెర్లాం పార్టీ మండల అధ్యక్షుడు బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, బుడా చైర్మన్ ప్రతినిధి ఐ.గోపాలరావు, బొబ్బిలి సచివాలయాల కన్వీనర్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

రాజాం సిటీ: స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


వావిలపల్లి శ్రీనివాసరావు

వంగర: ఎంపీడీఓగా వావిలపల్లి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా ఇక్కడి ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండగా, రాజాం ఎంపీడీఓ బి.హెచ్.శంకరరావు ఇక్కడి ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రాజాం ఈఓపీఆర్‌డీగా ఉన్న వావిలపల్లి శ్రీనివాసరావును వంగర ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ జెడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేయడం విశేషం.

6న వాహనాల వేలం

రాజాం సిటీ: స్థానిక టౌన్ సర్కిల్ కార్యాలయంతో పాటు ఎస్ఈబీ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీన వాహనాల వేలం వేయనున్నట్లు సీఐ కె.రవికుమార్, ఎస్ఈబీ సీఐ పీడీ ప్రసాద్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొని, వాహనాలు సొంతం చేసుకోవాలని వారు కోరారు.

నేడు గృహసారథుల శిక్షణ కార్యక్రమం

బాడంగి: స్థానిక స్వామి కల్యాణ మండపంలో గృహసారథుల శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల సచివాలయ జేసీఎస్ మరిపి శంకరరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు హాజరుకానున్నారని, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలంతా హాజరు కావాలని ఆయన కోరారు.

4న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

బాడంగి: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో చేరిన 13 మంది దివ్యాంగ చిన్నారులకు ప్రభుత్వం సమకూర్చిన ఉపకరణాలను శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంఐఆర్‌టీలు సత్యనారాయణమూర్తి, దాస్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు చేతుల మీదుగా ఉపకరణాలు పంపిణీ చేయనున్నామన్నారు.

విగ్రహాల ధ్వంసంపై కేసు నమోదు

రేగిడి: మండలంలోని సంకిలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని జాతీయ నాయకుల విగ్రహాల ధ్వంసంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడి మహాత్మాగాంధీ, అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు, చంద్రబోస్, స్వామి వివేకానంద విగ్రహాలున పాక్షికంగా ధ్వంసం చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

బొబ్బిలి: మండలంలోని రాచ్చెరువువలస గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరిగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.

అడిగిన వారికి పని కల్పించండి


రాజాం సిటీ: వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: గ్రామాల్లో ఉపాధి పనులు కావాలనుకునే వారందరికీ పనులు కల్పించండి అని ఎంపీడీఓ బి.శంకరరావు ఎఫ్ఏలకు సూచించారు. శుక్రవారం మండలంలోని బొద్దాం గ్రామంలో ఇరిగేషన్ కాలువలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు పూటలా కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.257 లభిస్తుందన్నారు.

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఉపాధి ఏపీఓ జగదీశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంటు, ప్రథమ చికిత్సా కిట్ ఉంచుకోవాలన్నారు.

మెంటాడ: మండలంలోని వెంకంపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ తివిక్రమ్ శుక్రవారం పరిశీలించారు. పని ప్రదేశంలో పనిముట్లతో చాలా జాగ్రత్తగా పనిచేయాలని ఎంపీడీఓ తెలిపారు.

బొబ్బిలి: మండలంలోని కాశిందొరవలస, నారాయణప్పవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ అల్లు భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. రెండు పూటలా పనిచేయాలని వేతనదారులకు ఆయన సూచించారు.

సంక్షిప్తంగా...

ఎస్‌డీసీకి రైతుల ఫిర్యాదు

మెంటాడ: సక్రమంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) ఎ.సూర్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ధాన్యం కొనుగోళ్లపై ఆరాతీశారు. అనంతరం ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగడం లేదని పలువురు రైతులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఎక్కడా ఎటువంటి అక్రమాలు జరగకుండా, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఎస్‌డీసీ ఆదేశించారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

తెర్లాం: మండల కేంద్రంలో కుష్టువ్యాధి నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ దీక్షితారాణి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు సూరిబాబు, త్రినాధరావు, సచివాలయ ఏఎన్ఎంలు ప్రశాంతి, ప్రభావతి ప్రతీ వీధికి వెళ్లి, కుష్టువ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్మూలనకు సహకరించాలని కోరుతూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మజ్జిగౌరమ్మ జాతర ప్రారంభం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో మజ్జిగౌరమ్మ జాతర శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు ఈ జాతర కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

97.72 శాతం పెన్షన్ల పంపిణీ

వంగర: మండలంలో శుక్రవారం నాటికి 97.72 శాతం మేర పెన్షన్ల పంపిణీ జరిగింది. మొత్తం 29 గ్రామపంచాయతీల్లో 6,534 మంది లబ్ధిదారులుండగా, వలంటీర్లు మూడు రోజులుగా ఇంటింటికీ వెళ్లి, పెన్షన్ నగదు అందజేస్తున్న విషయం తెలిసిందే.

రేగిడి: విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని రెడ్డిపేటకు చెందిన కుదిగాన లక్ష్మికి వలంటీర్ శాంతి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లిమరీ పెన్షన్ అందజేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరితగతిన భూముల రీసర్వే

వంగర: త్వరితగతిన భూముల రీసర్వే చేపట్టాలని చీపురుపల్లి డివిజన్ డీఐఓ రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్వేయర్లతో సమావేశమైన ఆయన మండలంలో ఇప్పటివరకు 9 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లో జరుగుతున్న సర్వేను కూడా వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, మండల సర్వేయర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

నిషేధిత పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు

రాజాం: నిషేధిత పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాలు, తోపుడుబండ్ల వ్యాపారాలను పరిశీలించిన ఆయన నిబంధనలను అతిక్రమిస్తూ పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు అపరాధ రుసుం విధించారు.

అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం


అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు

బొబ్బిలి: పాత బొబ్బిలి కూడలిలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవ పూజలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. హనుమాన్ దీక్షధారులు మండపారాధన, జలాధివాసం పూజలు చేశారు. యువసంకల్ప అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు సాగాయి.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

రామభద్రపురం: రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎంపీడీఓ రమామణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పీఎంకే రెడ్డితో సమావేశమైన ఆయన మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు, జలజీవన్ మిషన్ పథకం ద్వారా జరుగుతున్న ఇంటింటి కుళాయిల ఏర్పాటుపై సమీక్షించారు. డీఈఈ పీఎంకే రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రం తప్ప మిగిలి అన్ని గ్రామాల్లో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. పలు గ్రామాల్లో కుళాయి కనెక్షన్లు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. రామభద్రపురంలో తాగునీటి వసతి కల్పన కోసం రూ.202 కోట్లు నిధులు మంజూరయ్యాయని, మార్చి చివరి నాటికి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తామని సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు తెలిపారు. యువత హాజరై రక్తదానం చేయాలని కోరారు. రక్తదాన శిబిరాన్ని ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రారంభిస్తారని చెప్పారు.

ప్రతీ విద్యార్థితో పొదుపు ఖాతా తెరిపించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

రామభద్రపురం: ప్రతీ విద్యార్థితో ఎస్‌బీఐలో జన్‌ధన్ పొదుపు ఖాతా తెరిపించాలని ఎంఈఓ తిరుమలప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో అక్కడి ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన కలెక్టర్ ఆదేశాల మేరకు 10 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన ప్రతీ విద్యార్థి జన్‌ధన్ ఖాతా కలిగి ఉండాలన్నారు. ఈ నెల 15వ తేదీలోపు అన్ని పాఠశాలల్లోనూ శతశాతం విద్యార్థులు ఖాతాలు తెరిచేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రధాన బాధ్యత తీసుకోవాలన్నారు. సంబంధిత ధ్రువపత్రాలు విద్యార్థులు పాఠశాలకు తీసుకువస్తే ఎస్‌బీఐ మేనేజర్ పాఠశాలకు వచ్చి, ఖాతాలు తెరిపిస్తారని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలు చేయకపోతే చర్యలు


మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ సక్రమంగా అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని పణుకువలస ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన పాఠశాల పరిసరాలు, విద్యార్థుల తరగతి గదులు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం వంటకాలు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుచి, శుచితో భోజనం విద్యార్థులకు అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఉపాధి ఏపీఓ జగదీశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రమణ పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండగ


బంగారమ్మ ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని చొక్కాపు వీధిలో బంగారమ్మ తల్లి పండగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు పరిసర గ్రామాలైన సోంపురం, చింతలవలస, బూసాయివలస, ముచ్చర్లవలస, తారాపురం గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, బంగారమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, ప్రతీ ఒక్కరికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని తల్లిని వేడుకున్నారు. పసుపు, కుంకమ, చీరలు, కోళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలు ఊరేగించి, రాత్రి బంగారమ్మ అనుపోత్సవం నిర్వహించారు.

దమ్ముంటే చర్చకు రావాలి


ఏఎంసీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వ్యవసాయ రంగం, రైతు సంక్షేమంపై దమ్ముంటే చర్చకు రావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు టీడీపీ నేతలకు సవాలు విసిరారు. స్థానిక ఏఎంసీ భవనంలో శుక్రవారం జరిగిన ఏఎంసీ పాలకవర్గ తొలి సమావేశానికి హాజరైన ఆయన టీడీపీ హయాంలో రూ.98 కోట్ల మేర రైతుల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోతే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీర్చిందన్నారు. రుణమాఫీ చేస్తానని రైతులను ఎవరు మోసం చేశారో అందరికీ తెలుసన్నారు. రైతు పక్షపాతి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, విత్తనం దగ్గర నుంచి పంట కొనుగోలు వరకు రైతుకు మేలు జరిగేలా పనిచేస్తోందన్నారు. రైతుల కోసం గానీ వారి సంక్షేమం గురించి గానీ మాట్లాడే అర్హత మీకు, మీ పార్టీ అధినేత చంద్రబాబుకు లేదని టీడీపీ నేత బేబీ నాయనను ఉద్దేశించి అన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే తమ పార్టీయే అధికారంలోకి వస్తుందన్నారు. అంతకుముందు నియోజకవర్గంలోని వ్యవసాయోత్పత్తులు, పాడి, పంటలకు ఆర్థికసాయాలు, రైతుబజారు ఏర్పాటు, సేంద్రియ పంటల సాగుపై చర్చించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు బి. శ్రీనివాసరావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- నూతన సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు


నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని అంబకండి-2 సచివాలయం పరిధిలోని సోమరాజుపేటలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థను దేశంలోని మిగిలిన రాష్ట్రాలు కూడా ఏర్పాటు చేసుకునే ఆలోచనలో ఉన్నాయన్నారు. గతంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని, ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారం వ్యవధిలోనే సచివాలయం వేదికగా సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదన్న సదుద్దేశ్యంతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇటువటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి, సంక్షేమం ఊపందుకుంటున్నాయన్నారు. సచివాలయ, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రభుత్వానికి మీకు మంచిపేరు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.అచ్చెన్నాయుడు, మండల పార్టీ కన్వీనర్ వి.జగన్‌మోహనరావు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి జి.భార్గవి, పంచాయతీ కార్యదర్శి హేమసుందర్, సర్పంచ్ ఎస్.రమేష్‌నాయుడు, ఎంపీటీసీలు పి.అప్పలనాయుడు, పి.సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎల్.గణపతిరావునాయుడు, ఎల్.వేణునాయుడు, ఎల్.హరిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గృహాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ గౌరీశంకరరావు

వంగర: జగనన్న ఇళ్ల పథకంలో భాగంగా భాగంగా అర్హులకు మంజూరు చేసిన గృహాలకు సంబంధించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ గండి గౌరీశంకరరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన మండలంలో మంజూరైన 1,745 గృహాల రిజిస్ట్రేషన్ చేపట్టి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు, ఏఈ జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించేలా బోధన


మాట్లాడుతున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: విద్యార్థులంతా ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా బోధన చేయాలని లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం స్టేట్ అబ్జర్వర్ జయకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని అరసాడ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని తెలిపారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం ఎంఈఓ వై.దుర్గారావు విద్యా ప్రగతికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.రాజ్యలక్ష్మి, జి.నాగభూషణదొర పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 242 మంది ఎంపిక


జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

బొబ్బిలి: స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీ హీరో డ్రగ్స్ వారు శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఇంటర్వ్యూకు మొత్తం 560 మంది హాజరు కాగా 242 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ రెడ్డి మోహన్‌రావు, కంపెనీ హెచ్ఆర్ వి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

బొబ్బిలిలో 'తోటబడి'


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారి వెంకటరత్నం

బొబ్బిలి: మండల కేంద్రంతో పాటు చుట్టుపక్క పరిసర ప్రాంతాల్లోని తోటల్లో వైఎస్సార్ తోటబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి ఎస్.వెంకటరత్నం వివిధ పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు. పురుగుమందు పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

వైఎస్సార్ కల్యాణమస్తు దరఖాస్తుల పరిశీలన

తెర్లాం: స్థానిక సచివాలయంలో వైఎస్సార్ కల్యాణమస్తు పథకం లబ్ధి కోసం పలువురు చేసుకున్న దరఖాస్తులను వెలుగు డీపీఎం చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. కొత్తగా పెళ్లయిన జంటలు చేసుకున్న ఈ దరఖాస్తులు నిజమైనవేనా కావా అనే విషయం సరిచూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ వైఎస్సార్ కల్యాణమస్తు పథకం లబ్ధి వర్తింపజేస్తామన్నారు.

ఏకగ్రీవంగా హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నిక


ఎన్నికైన హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్లు

బొబ్బిలి: సహకారశాఖ, కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నిక స్థానిక కో ఆపరేటివ్ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. 9 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. వీరిలో అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకోనున్నారు.